13-08-2023 ప్రాత:మురళి ఓంశాంతి "అవ్యక్త బాప్ దాదా" రివైజ్ 06-04-95
మధువనం

"పవిత్రతతో కూడిన ఆత్మిక పర్సనాలిటీ యొక్క స్మృతి స్వరూపము ద్వారా మాయాజీతులుగా అవ్వండి"

ఈ రోజు స్నేహ సాగరుడైన బాప్ దాదా నలువైపులా ఉన్న సర్వ స్నేహీ పిల్లలను చూస్తున్నారు. స్నేహీ పిల్లలు ప్రతి ఒక్కరి మూర్తిలో ఆత్మిక పర్సనాలిటీ యొక్క మెరుపును చూస్తున్నారు. బాహ్య రూపంగా అయితే సాధారణ పర్సనాలిటీ కలిగినవారు కానీ ఆత్మిక పర్సనాలిటీలో అందరికంటే నంబరువన్. ప్రపంచంలో అనేక రకాల పర్సనాలిటీల గురించి గాయనం చేస్తారు. శారీరక పర్సనాలిటీ, ఏదైనా విశేషత యొక్క పర్సనాలిటీ, ఏదైనా విశేష పొజిషన్ యొక్క పర్సనాలిటీ, కానీ మీ అందరి ముఖాలపై, నడవడికలో ఏ పర్సనాలిటీ కనిపిస్తుంది? పవిత్రతా పర్సనాలిటీ. పవిత్రతయే పర్సనాలిటీ. ఎవరైనా ఎంతెంతగా పవిత్రంగా ఉంటారో అంతంతగా వారి పర్సనాలిటీ కనిపించడమే కాదు కానీ అనుభవం కూడా అవుతుంది. అందరూ మీ ఆత్మిక పర్సనాలిటీని అనుభవం చేసుకుంటున్నారా? మీ వంటి పర్సనాలిటీ సత్యయుగం నుండి ఇప్పటివరకు ఎవరికైనా ఉందా? పూర్తి కల్పం చుట్టి రండి, మీ వంటి పర్సనాలిటీ ఎవరికైనా ఉందా? లేదు కదా! మరి మీకు మీ ఆత్మిక పర్సనాలిటీ యొక్క నషా ఉందా! అనాది కాలంలో అయితే పరంధామంలో కూడా విశేష ఆత్మలైన మీ పర్సనాలిటీ అందరికంటే ఉన్నతమైనది. ఆత్మలన్నీ మెరుస్తూ ఉన్నటువంటి జ్యోతులే అయి ఉండవచ్చు కానీ ఆత్మిక పర్సనాలిటీ కలిగిన ఆత్మలైన మీ మెరుపు ఇతర ఆత్మలు అన్నింటికన్నా అతీతంగా మరియు ప్రియంగా ఉంటుంది. మీ అనాది కాలంలోని పర్సనాలిటీని స్మృతిలోకి తీసుకురండి. గుర్తుకు వచ్చిందా? చూసుకుంటున్నారా? బాప్ దాదాతో పాటు ఈ విధంగా ఆత్మిక పర్సనాలిటీతో ఎలా కనిపిస్తున్నారో చూసుకుంటున్నారా. మిమ్మల్ని మీరు చూసుకోగలుగుతున్నారా? అయితే అనాది కాలంలోకి వెళ్ళిపోండి. ఎంత సమయంలో వెళ్ళగలరు? వెళ్ళడానికి ఎంత సమయం పడుతుంది? సెకండు కన్నా తక్కువ కదా! లేక ఒక రోజు, ఒక గంట పడుతుందా? సెకండు కన్నా తక్కువ సమయంలో ఎక్కడికి కావాలంటే అక్కడికి చేరుకోగలరు. మరి అనాది కాలంలోని మీ పర్సనాలిటీని చూసుకున్నారా? ఇప్పుడు అనాది కాలం నుండి ఆది కాలంలోకి రండి. వచ్చేసారా లేక ఇంకా వస్తూ ఉన్నారా? చేరుకున్నారా? అనాది కాలం తర్వాత ఆది కాలంలో మీ ఆత్మిక పర్సనాలిటీని చూడండి - ఎంతటి శ్రేష్ఠమైన పర్సనాలిటీ! తనువు పరంగా కూడా, మనసు పరంగా కూడా, అలాగే ధనము పరంగా కూడా మరియు సంబంధాల పరంగా కూడా. అన్ని రకాలుగా పర్సనాలిటీ ఎంత శ్రేష్ఠమైనది! మరి ఆది కాలంలోని పర్సనాలిటీని చూసుకుంటున్నారా? ఎంత సుందరంగా అనిపిస్తున్నారు, ఎంతగా అలంకరించబడి ఉన్నారు, ఎంతగా సుఖము, శాంతి, ప్రేమ, ఆనంద స్వరూపులుగా ఉన్నారు, ఇలా ఆది కాలంలో కూడా మీ పర్సనాలిటీని చూసుకోండి. స్పష్టంగా కనిపిస్తుందా లేక 5 వేల సంవత్సరాల క్రితం విషయం కాబట్టి అంత స్పష్టంగా లేదా? అందరికీ స్పష్టంగా ఉందా? అందరూ తెలివైనవారు. అయితే ఆది కాలంలో కూడా మీది చూసుకున్నారు. ఇప్పుడు మధ్య కాలంలోకి రండి, మధ్య కాలంలో కూడా మీ పర్సనాలిటీ ఎలా ఉంది? మీ జడ చిత్రాలు ఎంత విధి పూర్వకంగా పూజించబడుతున్నాయి మరియు మహిమ చేయబడుతున్నాయి. ధర్మాత్ములు, మహాత్ములు, నేతలు వీరందరూ ఎంతగా పర్సనాలిటీ కలిగినవారిగా గాయనం చేయబడినా కానీ మీ జడ చిత్రాల పర్సనాలిటీ ముందు వారి పర్సనాలిటీ అసలేమీ కాదు! మీ అందరికీ పూజ జరిగిన విధంగా ఏ మహాత్మకైనా, నేతకైనా లేక ధర్మాత్మకైనా విధి పూర్వకంగా పూజ జరుగుతుందా? ఎప్పుడైనా చూసారా? మీ జడ చిత్రాలకు జరిగినంత అలంకరణ ఇంకెవరికైనా జరుగుతుందా? కావున మధ్య కాలంలో కూడా ఆత్మలైన మీ పవిత్రతా పర్సనాలిటీ యొక్క విశేషత ఎంత శ్రేష్ఠమైనది! మీ చిత్రాన్ని చూసుకున్నారా? మీ పూజ జరుగుతుందా లేదా? కేవలం పెద్ద-పెద్ద వారి పూజే జరుగుతుంది, మాది కాదు అంటారా! డబుల్ విదేశీయుల మందిరం ఉందా? చూసారా, అందులో మీ చిత్రము ఉందా? లేక విన్నాము కాబట్టి అవును, ఉంటాము అంటున్నారా! గుర్తుకు వచ్చిందా? మరి మీ మధ్య కాలం కూడా అతి శ్రేష్ఠంగా ఉంది. ఇప్పుడు చివరి జన్మలో ఉన్నది మరజీవా బ్రాహ్మణ జన్మ, ఇక్కడ పర్సనాలిటీని చూడండి, ఎంత గొప్పది! ఎంత గాయనం ఉంది - ఏ శ్రేష్ఠ కార్యమునైనా ఇప్పటికీ మీ నామధారీ బ్రాహ్మణులే చేస్తున్నారు. ఇప్పటి బ్రాహ్మణులు బ్రాహ్మణులుగా లేకపోయినా కానీ పేరుకైతే బ్రాహ్మణులే కదా! మీ పేరుతో మీ పర్సనాలిటీ కారణంగా వారు కూడా శ్రేష్ఠమైనవారిగా గాయనం చేయబడుతున్నారు. మరి బ్రాహ్మణ జన్మ యొక్క పర్సనాలిటీ ఎంత శ్రేష్ఠమైనది! ఆది కాలము, అనాది కాలము, మధ్య కాలము మరియు ఇప్పుడు అంతిమ కాలము - పూర్తి కల్పంలో మీ పర్సనాలిటీ సదా మహాన్ గానే ఉంది.

లౌకిక పర్సనాలిటీ కలవారికి ఒకవేళ పేరు వచ్చినా కానీ ఏదైనా విశేష పుస్తకంలో వారి పేరు వస్తుంది - ఫలానా ఫలానా వారు అని. కానీ మీ పేరు ఎందులో వస్తుంది? సాధారణ పుస్తకములో రాదు, శాస్త్రాలలో వస్తుంది. ఆది కాలం నుండి ఏవైతే శాస్త్రాలు తయారయ్యాయో, వాటిలో ఎవరి చరిత్ర ఉంది? ఎవరి గాయనం ఉంది? ఎవరి కథలు ఉన్నాయి? లౌకిక పర్సనాలిటీ కలవారి గాయనము విశేషమైన పుస్తకంలో ఉంటుంది మరియు మీ గాయనము శాస్త్రాలలో ఉంటుంది. ఆ శాస్త్రాలకు ఎంతటి ఆదరణ ఉంది! ఎంతో విధి పూర్వకంగా శాస్త్రాలను సంభాళిస్తారు, వాటిని కూడా ఎంతో పూజ్య రూపంలో చూస్తారు. సత్యమైన భక్తులు ఎవరైతే ఉంటారో, వారు శాస్త్రాలను విధి పూర్వకంగా పెట్టుకుంటారు కూడా మరియు చదువుతారు కూడా. సాధారణ పుస్తకాల వలె పెట్టుకోరు. మరి మీ పవిత్రతా పర్సనాలిటీని సదా ఇమర్జ్ రూపంలో స్మృతిలో ఉంచుకోండి. తెలుసులే... అది మేమే కదా... అని మర్జ్ రూపములో కాదు. స్మృతి స్వరూపంలో ఉంచుకోండి. ఎవరి బుద్ధిలో అయితే ఇమర్జ్ రూపంలో ఈ స్మృతి ఉంటుందో, ఆ స్మృతియే సమర్థతకు ఆధారము. మరియు ఎక్కడైతే సమర్థత ఉంటుందో, అక్కడకు మాయ రాగలదా? సమర్థ ఆత్మ వద్దకు మాయ రావడము అసంభవము. శ్రమించే అవసరమే లేదు. మాయ పని రావడము కానీ మీ పని ఇప్పటి సమయమనుసారంగా మాయను పారద్రోలడము కాదు. మాయ వచ్చింది, పారద్రోలాము, కాదు. మీ పని సదా మాయాజీతులుగా ఉండటము. మరి మాయాజీతులుగా ఉన్నారా లేక మాయను పదే-పదే పారద్రోలేవారా? ఇప్పటికీ పారద్రోలవలసి వస్తుందా, కొద్దికొద్దిగా అది మీకు దర్శనం ఇవ్వడానికి వస్తూ ఉంటుందా! అలా కాదు కదా! డబుల్ విదేశీయులు మాయను సదా కోసం పారద్రోలారా? లేక పారద్రోలుతూనే ఉంటారా? ఏమిటి పరిస్థితి? మాయ సదా కోసం వెళ్ళిపోయిందా? ఇప్పుడిక రాదు కదా? లేక కొద్దికొద్దిగా వచ్చినా పర్వాలేదా? ఎంతైనా అర్ధ కల్పపు స్నేహము ఉంది, ఫ్రెండ్ కదా! మరి దానిని అలా, అస్సలు రానే రానంతగా వదిలేస్తారా! సమయం సమాప్తి అవ్వకముందే బహుకాలపు మాయాజీతులుగా అయ్యే అభ్యాసం ఉండాలి అని వినిపించాము కదా. ఇది చివరిలో సాధ్యం కాదు. ఒకవేళ అంతిమంలో మాయాజీతులుగా అయ్యే పురుషార్థం చేసినా పరిస్థితి ఎలా ఉంటుంది. బాప్ దాదా చిలుక కథను వినిపిస్తారు కదా, చిలుకకు కుళాయిపై కూర్చోవద్దు అని చెప్పారు, కానీ అది కుళాయిపై కూర్చునే ఆ మాట చెప్తూ ఉంటుంది. అలాగే అంతిమ సమయంలో ఒకవేళ బహుకాలపు అభ్యాసం లేకపోతే మనసులో నేను ఆత్మను, నేను ఆత్మను అని అనుకుంటూ ఉంటారు కానీ మాయ ప్రభావం కూడా ఉంటూ ఉంటుంది, నేను ఆత్మను, నేను ఆత్మను అన్న ప్రయత్నం కూడా చేస్తూ ఉంటారు కానీ అది జరగదు. అందుకే ఏం చేయాలి? ఇప్పటి నుండే మాయాజీతులుగా అయ్యే అభ్యాసం చేయండి. అందుకు సహజ సాధనము - తమ ఆత్మిక పర్సనాలిటీని స్మృతి స్వరూపంలో పెట్టుకోండి. పర్సనాలిటీ కలవారి గుర్తులు ఏమి ఉంటాయి? ఉన్నత పర్సనాలిటీ కలిగినవారి దృష్టి ఎక్కడికి, ఎవరివైపుకు వెళ్ళదు. వీరిలా ఉన్నారు, వీరిలా ఉన్నారు, ఇతను ఇలా చేస్తారు, ఈమె ఇలా చేస్తుంది, నేనెందుకు చేయకూడదు, నేనెందుకు చేయలేను... ఇతరుల ప్రాప్తి వైపుకు వారి దృష్టి వెళ్ళదు. ఎందుకు? ఆత్మిక పర్సనాలిటీ కలవారు సర్వ ప్రాప్తులతో సంపన్నంగా ఉంటారు. స్వభావంలో కూడా సంపన్నము, సంస్కారాలలో కూడా సంపన్నము మరియు సంబంధ-సంపర్కాలలో కూడా సంపన్నముగా, నిండుగా ఉంటారు. వారు ఎప్పుడూ తమ ప్రాప్తుల భాండాగారములో ఏ అప్రాప్తిని అనుభవం చేయనే చేయరు. ఎందుకని? ఆత్మిక పర్సనాలిటీ కారణంగా వారు సదా మనసుతో నిండుగా ఉన్న కారణంగా సంతుష్టంగా ఉంటారు. స్వయంలో అప్రాప్తి అనుభవం చేసుకున్నప్పుడు దృష్టి ఇతరుల వైపుకు వెళ్తుంది. మరి మీకు ఏదైనా అప్రాప్తి ఉందా? పాట ఏమని పాడుతారు - బ్రాహ్మణుల ఖజానాలో అప్రాప్తి అన్న వస్తువే లేదు... ఈ పాటను నోటితో కాకుండా మనసుతో పాడుతారు కదా? అలా పాడేవారు చేతులెత్తండి. అచ్చా, డబుల్ విదేశీయులు కూడా పాట పాడుతారా? అచ్చా!

బాప్ దాదా ఈ రోజు నలు వైపుల ఉన్న పిల్లల పవిత్రతా పర్సనాలిటీని చెక్ చేస్తున్నారు. పవిత్రత యొక్క నిర్వచనము గురించి కూడా బాగా తెలుసుకున్నారు. పవిత్రత అంటే కేవలం బ్రహ్మచర్య వ్రతమే కాదు, బ్రహ్మచర్య వ్రతంలో అయితే నేటి పరిస్థితుల అనుసారంగా ఎంతోమంది అజ్ఞానులు కూడా ఉంటున్నారు. జ్ఞానంతో కాదు కానీ పరిస్థితులను చూసి. ఎందరో భక్తులు కూడా ఉంటున్నారు. అదేమంత పెద్ద విషయము కాదు. కానీ పవిత్రతను రోజంతటిలో చెక్ చేసుకోండి - పవిత్రతకు గుర్తు స్వచ్ఛత, సత్యత. ఒకవేళ రోజంతటిలో లేవడములో, కూర్చోవడములో, మాట్లాడడములో, సేవ చేయడములో, స్థూల సేవ చేసినా లేక సూక్ష్మ సేవ చేసినా, దానిని ఒకవేళ విధి పూర్వకంగా చేయకపోతే, విధిలో కూడా ఒకవేళ కొద్దిగా తేడా వచ్చినా అది కూడా స్వచ్ఛత అనగా పవిత్రత కాదు. వ్యర్థ సంకల్పాలు కూడా అపవిత్రతయే. ఎందుకని? మేము పాపమైతే చేయలేదు కదా, ఎవరికీ దుఃఖమైతే ఇవ్వలేదు కదా అని మీరు అనుకోవచ్చు కానీ ఒకవేళ వ్యర్థం నడిచినా, సమయం వృథా అయినా, సంకల్పాలు వృథా అయినా, సంతుష్టత కోల్పోయినా, మీ పవిత్రత యొక్క ఫైనల్ స్టేజ్ యొక్క డిగ్రీలో తేడా వచ్చేస్తుంది. 16 కళలు కలవారిగా అవ్వలేరు. 15 కళలు, 14 కళలు, పదిహేనున్నర కళలు... నంబరువారుగా అయిపోతారు. కనుక అపవిత్రత అంటే కేవలం ఎవరికైనా దుఃఖాన్ని

ఇవ్వడమో లేక పాప కర్మ చేయడమో మాత్రమే కాదు. స్వయంలో సత్యత మరియు స్వచ్ఛతలను విధి పూర్వకంగా అనుభవం చేస్తే మీరు పవిత్రులు. అలా వచ్చేసింది, అలా మాట్లాడకూడదు కానీ మాట్లాడేసాను, దీనిని ఏమంటారు? యజమానులా? అందుకే అమృతవేళ నుండి రాత్రి వరకు మీ సంకల్పాలు, మాటలు, కర్మలు మరియు సేవ - అన్నింటినీ చెక్ చేసుకోండి. బయటకు కనిపించే విషయాలలోనే చెక్ చేసుకోవడం కాదు. బయటకు కనిపించే విషయాలలోనే చెక్ చేసుకుంటే, చూడండి, చంద్రవంశీయులకు గుర్తుగా విల్లు-బాణము ఇచ్చారు మరియు సూర్యవంశీయులకు ఎంత చిన్నని మురళిని ఇచ్చారు. మురళి ఎంత తేలికగా ఉంటుంది! విల్లు-బాణము ఎంత కష్టము! ముందేమో గురిని కుదర్చాలి, ఆపై బరువు ఎత్తి పట్టుకోవాలి. అదే మురళిని చూడండి - ఆడండి, పాడండి, నవ్వండి, ఆడుకోండి. అందుకే పురుషార్థాన్ని కానీ, చెకింగ్ ను కానీ కేవలం కనిపించే విషయాల వరకే పరిమితం చేయకండి. ఇప్పుడు సూక్ష్మ బుద్ధి కలవారిగా అవ్వండి ఎందుకంటే సమయము యొక్క సమాప్తి అకస్మాత్తుగా జరుగనున్నది, చెప్పి జరగదు. బాబా, మీరు ముందే ఎందుకు చెప్పలేదు అని ఫిర్యాదు చేయకండి అని బాప్ దాదా అయితే ముందే చెప్పారు. తండ్రి ఎప్పుడూ టైమ్ కాన్షస్ గా చేయరు. ఇప్పుడు పూర్తి డైమండ్ గా అవ్వాలి కదా! మరి ప్రతిజ్ఞ చేసారు కదా! డైమండ్ జూబ్లీ జరుపుకోవాలా లేక డైమండ్ గా అవ్వాలా? ఏమి చేయాలి? అవ్వాలి కూడా, జరుపుకోవాలి కూడా. రెండూ కలిపి చేయాలి. మరి బాప్ దాదా వచ్చే సంవత్సరం చెక్ చేస్తారు - ప్రతిజ్ఞను నిలబెట్టుకున్నారా లేక కేవలం నోరు తీపి చేసుకున్నారా? మీరు ఎవరు? కేవలం మాట్లాడేవారా లేక నిలబెట్టుకునేవారా? అచ్ఛా! చూడండి, టి.వీ.లో మీ అందరి ఫోటో వస్తుంది, తర్వాత మారిపోకండి - నేను లేనే లేను, నేను చెప్పలేదు అనకండి! తయారవ్వడమైతే మంచిదే కదా, మరి మంచి విషయాన్ని త్వరగా చేయాలా లేక ఆలస్యంగానా? త్వరగా చేయాలి కదా!

సెకండులో ఎవర్రెడీగా అవ్వగలరా? సెకండులో అశరీరిగా అవ్వగలరా? లేక యుద్ధం చేయాల్సి వస్తుందా - కాదు, నేను శరీరాన్ని కాదు, నేను శరీరాన్ని కాదు... ఇలా అయితే లేరు కదా! ఆలోచించడము, జరిగిపోవడము అన్నట్లు ఉండాలి. ఆలోచించడము మరియు స్థితులవ్వడము (బాప్ దాదా కొన్ని నిమిషాలు డ్రిల్ చేయించారు). మంచిగా అనిపిస్తుంది కదా! మరి రోజంతటిలో మధ్యమధ్యలో ఈ అభ్యాసాన్ని చేయండి. ఎంత బిజీగా ఉన్నా కానీ మధ్య-మధ్యలో ఒక్క సెకండు అయినా అశరీరిగా అయ్యే అభ్యాసాన్ని తప్పకుండా చేయండి. దీనికైతే ఎవ్వరు కూడా - నేను బిజీగా ఉన్నాను అని చెప్పలేరు. ఒక్క సెకండు వెచ్చించాల్సిందే, అభ్యాసం చేయాల్సిందే. ఎవరితోనైనా మాట్లాడుతున్నా సరే, ఎవరితోనైనా కలిసి పని చేస్తున్నా సరే, వారితో కూడా ఒక సెకండు ఈ డ్రిల్ చేయించండి, ఎందుకంటే సమయమనుసారంగా ఈ అశరీరితనము యొక్క అనుభవము, ఈ అభ్యాసము ఎవరికి ఎంత ఎక్కువ ఉంటే, వారు ముందు నంబరు తీసేసుకుంటారు ఎందుకంటే సమయ సమాప్తి అకస్మాత్తుగా జరుగనున్నది అని వినిపించాము కదా. అశరీరిగా అయ్యే అభ్యాసం ఉంటే వెంటనే సమయ సమాప్తి యొక్క వైబ్రేషన్స్ వస్తాయి, అందుకే ఇప్పటి నుండే అభ్యాసాన్ని పెంచండి. అంతేకానీ, వచ్చే సంవత్సరం డైమండ్ జూబ్లీ ఉంది కదా, అందుకే ఇప్పుడు చేయము, తర్వాత చేస్తాము అని అనకండి. ఎంతగా బహుకాలాన్ని ఏడ్ (జత) చేస్తూ ఉంటారో, అంతగా రాజ్య భాగ్యపు ప్రాప్తిలో కూడా ముందు నంబరు తీసుకుంటారు. ఒకవేళ మధ్యమధ్యలో ఈ అభ్యాసాన్ని చేసినట్లయితే స్వతహాగానే శక్తిశాలి స్థితిని సహజంగా అనుభవం చేస్తారు. చిన్న-చిన్న విషయాలలో ఏదైతే పురుషార్థము చేయవలసి వస్తుందో, అదంతా సహజంగా సమాప్తమవుతుంది.

అచ్ఛా, అందరూ సంతోషంగా-సంతుష్టంగా ఉన్నారా లేక అడగాల్సిన అవసరముందా? మాతలు సంతోషంగా ఉన్నారా? చాలా మంచిది. చూడండి, ఎక్కడెక్కడి నుండో మేళాకు చేరుకున్నారు. మంచి ఛాన్సు లభించింది కదా, లేకపోతే - మా నంబరు ఎప్పుడు వస్తుంది, మా నంబరు ఎప్పుడు వస్తుంది అని డేట్ కోసం ఎదురుచూస్తూ ఉండేవారు. ఇప్పుడైతే అందరికీ ఆహ్వానం ఉంది కదా! అందరూ మంచిగా ఉంటున్నారా? బేహద్ (అనంతము) అనుభవం అవుతుంది కదా? లేక కొద్ది-కొద్దిగా ఇబ్బందులు ఉన్నాయా? వృద్ధ మాతలకు ఇబ్బంది కలగలేదా? లైనులో ఉంటేనే భోజనం లభిస్తుంది! లైనులో వేచి ఉండటము వలన అలసట కలగలేదా? మజా వస్తుందా? ఇంత పెద్ద పరివారం ఎప్పుడు లభిస్తుంది! కావున పరివారాన్ని చూసి హర్షితులవుతున్నారు కదా! భక్తి మార్గపు మేళా కన్నా ఇది మంచి మేళా కదా? మరో రెండు రోజులు పెంచమంటారా లేక బస్సు ఖర్చులు ఉంటాయా? ఇల్లు గుర్తుకు రాదా? ఉద్యోగం గుర్తుకు రాదా? ఏదైనా ఒక నవీనత ఉండాలి కదా, మరి ఈ మేళా కూడా ఒక నవీనత. నవీనతను అనుభవం చేసుకున్నారు. ఇప్పుడిక పాత విషయాలు ఉంటాయా, కొత్త విషయాలే ఉంటాయి కదా! కొత్త విషయాలు మంచిగా అనిపిస్తాయా లేక పాతవా? కొత్త

విషయాలు మంచిగా అనిపిస్తాయి కదా! అచ్ఛా.

నలువైపులా ఉన్న సర్వ ఆత్మిక పవిత్రతా పర్సనాలిటీ కలిగిన విశేష ఆత్మలకు, సదా ఆది నుండి అంతిమం వరకు పర్సనాలిటీ యొక్క మెరుపును చూపించే శ్రేష్ఠ ఆత్మలకు, సదా పవిత్రత, స్వచ్ఛత, సత్యతా శక్తులతో స్వయాన్ని మరియు విశ్వాన్ని పరివర్తన చేసే విశ్వ పరివర్తక ఆత్మలకు, సదా నిమిత్త భావంతో సేవాధారిగా అయ్యి ప్రత్యక్ష ఫలాన్ని అనుభవం చేసే అనుభవీ ఆత్మలకు బాప్ దాదా యొక్క ప్రియస్మృతులు మరియు నమస్తే.

దాదీలతో:- మేళా మంచిగా అయ్యిందా? ఏమీ ఇబ్బంది అవ్వలేదు కదా? అందరి శుభ సంకల్పాలు మరియు ఉల్లాస-ఉత్సాహాల సంకల్పాలతో సఫలత ఉండనే ఉంటుంది. ఈ సంగఠనలోని సంకల్పం ఎలా ఉంటుందంటే అది అసఫలతను తొలగించివేస్తుంది. ఎలా అయితే ఒక కోట ఉంటుంది కదా, అందులో ఒక్క ఇటుకు కదిలినా ఆ కోట బలహీనమవుతుంది, అన్ని ఇటుకలు దృఢంగా ఉంటే కోట కదలదు, విజయము ఉంటుంది. అలాగే ఇక్కడ కూడా సంగఠనతో, ఉల్లాస-ఉత్సాహాలు మరియు శ్రేష్ఠ సంకల్పాలతో, సహయోగముతో సఫలత లభించే ఉంది. మంచిగా అనిపించింది, ఎప్పటికప్పుడు ఇంకా ఇలా అనుభవం చేసుకుంటూ ఉంటారు. మొదట్లో సాధ్యమవుతుందా అని ప్రశ్న వచ్చేది, కానీ ఏది అనుకుంటే అందులో సఫలత ఉండనే ఉంటుంది. కావున సఫలతామూర్త వరదానము సంగఠన శక్తికి లభిస్తుంది. బాప్ దాదా సదా గుడ్ మార్నింగ్, గుడ్ నైట్ చెప్తారు. అచ్ఛా, డబుల్ విదేశీయులు ఎగురుతున్నారు కదా. మంచిది. ఓం శాంతి.

వరదానము:- స్వరాజ్యాధికారిగా అయ్యి కర్మేంద్రియాలను ఆజ్ఞానుసారంగా నడిపించే భృకుటి సింహాసన మరియు హృదయ సింహాసనాధికారీ భవ

నేను భృకుటి సింహాసనాధికారీ ఆత్మను అనగా స్వరాజ్యాధికారీ రాజును. ఏ విధంగా రాజు సింహాసనముపై కూర్చుని ఉన్నప్పుడు కర్మచారులందరూ ఆజ్ఞానుసారంగా నడుచుకుంటారో, అలా సింహాసనాధికారులుగా అవ్వటం ద్వారా ఈ కర్మేంద్రియాలు స్వతహాగానే ఆజ్ఞానుసారంగా నడుస్తాయి. ఎవరైతే భృకుటి సింహాసనాధికారులుగా ఉంటారో వారి కొరకు తండ్రి హృదయ సింహాసనమైతే ఉండనే ఉంది ఎందుకంటే ఆత్మగా భావించటం ద్వారా తండ్రే గుర్తుకు వస్తారు, అప్పుడిక దేహము లేదు, దేహ సంబంధాలు లేవు, పదార్థాలు లేవు, ఒక్క తండ్రే ప్రపంచము, అందుకే భృకుటి సింహాసనాధికారులుగా ఉన్నవారు తండ్రి హృదయ సింహాసనాధికారులుగా స్వతహాగా అవుతారు.

స్లోగన్:- నిర్ణయించే, పరిశీలించే మరియు గ్రహించే శక్తులను ధారణ చెయ్యటమే హోలీహంసలుగా అవ్వటము.